# పుల్లావు పారిపోయింది

★

సురాజ్

కన్నెతాడు తెంపుకుని పారిపోయిన పుల్లావు ఉనికి దొరికిందన్న సంబరంలో తను ఆవకాయీ అన్నమూ పావుగంటనుంచి పైగా కలుపుకుంటున్న సంగతే మరిచిపోయాడు రామనాథం. ఎక్కువసేపు వుండబట్టలేక రత్తమ్మే అంది. "ఏవండీ! మిమ్మల్నే, ఏమిటే ఆలోచిస్తున్నారు? పుల్లావు ఎక్కడుందో తెలిసిందిగా! ఇక భోంచెయ్యండి మరి!"

రామనాథం వినిపించుకునే స్థితిలో లేడు. రత్తమ్మకి విసుగెత్తింది. హరికేన్ లాంతరు టపటప కొట్టుకుంటోంది. కిరసనాయలులో నీరు కలిసిందేమో అది ఆరిపోయి ఉన్నంతసేపు వెలగడమే లేదు. వరాండాలో పాలికాపు గంగడు చిట్టు పట్టికెళ్ళ వలసిన తట్టని బస్తామీద పడేసి రామనాథం రాకకోసం ఎదురు చూస్తూ గోడకి ఆనుకుని చుట్టకాలుస్తూ కూర్చున్నాడు. దీపం అయిదు నిమషాలు నిశ్శబ్దంగా వుండి రెపరెప లాడటం మొదలు పెట్టింది.

"మిమ్మల్నేనండీ! వెధవ దీపంకూడా ఆరిపోతోంది. దొరికిన పుల్లావు అక్కణ్ణుంచి మళ్ళీ పారిపోదులెండి! దొడ్లోనే కట్టేశారుగా! ఆవకాయీ అన్నం నీళ్లు కారుతోంది!"

ఇంకా మాట్లాడక పోవడం చూసి నిజంగా చిరాకేసింది రత్తమ్మకి. కాదు మరీ! రామనాథం తింటేనే కాని ఆమె వడ్డించుకునే అలవాటు లేదు. కడుపులో కాలిపోతోంది! విసుగ్గా అంది రత్తమ్మ. "నే ఆకలితో చస్తేమాత్రం మీకేం కావాలి. ఏమండోయ్!" యింక భరించలేక అరిచేసరికి యీలోకంలోకి ఊడిపడ్డాడు రామనాథం. మెల్లగా నవ్వుకుంటూ "దూడంత దుఖ్ఖం పాడంత సుఖ్ఖం లేదుస్మా" అని మాత్రం అన్నాడు. నిజంగా రత్తమ్మకి యీసారి గుడ్డుకి కుంచెడు నీళ్లు తిరిగాయి. రామనాథానికి అతని ఆలోచనే కాని రత్తమ్మ ఆకలితో బాధపడుతోందని ఆలోచించడే. పారిపోయి దొరికిన ఆ పుల్లావు మీద వున్న ఆపేక్ష అగ్నిసాక్షిగా పెళ్లాడిన రత్తమ్మమీద ఎందుకు చూపకూడదూ! అదే రత్తమ్మని వేధించే ప్రస్తుత సమస్య.

"ఎప్పుడూ దూడా దుక్కీ అని అనుకోవడమే కానీ నే నెలా ఆకలితో చచ్చినా మీ కక్కర్లేదా ఏమండీ! పాడికోసం నూటఏభై వాడి మొగాన్న కొట్టి తెచ్చుకున్న పుల్లావు పారిపోతే మూడురోజులు యింటికి రాకుండా తిరిగేరే! మీ కోసం తల్లి తండ్రుల్ని వదులుకుని కాపరంచేయడానికి వచ్చిన పెళ్లాం ఏమైందో అని కొంచమేనా ఆలోచించారా! ఈ మూడు రోజులూ యింట్లో ఎవ్వళ్లూ లేకండా ఎలావున్నానో ఎలా బాధపడ్డానో!" రత్తమ్మ సంగతేమో గాని తన సంగతిమాత్రం బాగా జ్ఞాపకం వుంది రామనాథానికి.

"నేను మాత్రం ఎంతబాధ పడ్డానో తెలుసా?"

ఎందుకు? ఎవరికోసం? రత్తమ్మ యీ ప్రశ్నలు అడిగే లోపునే రామనాథం మూడు రోజుల్లో జరిగిన చరిత్రనీ సింహావలోకనం చేసుకోవటం మొదలెట్టాడు.

తాడు తెంపుకుని పుల్లావు పారిపోయిందని గంగవచ్చి చెప్పగానే గంగవెర్రెత్తిపోయి పైమీది ఖండువాకూడా వేసుకోకుండానే పొలం చక్కాపోయాడు.

కొట్టొచ్చినంత హంగామా చేస్తూ అన్నాడు రామనాథం. "పశువుల్ని వదిలి ఎక్కడికి పోయావురా వెధవా"

"అరకసామాన్లకోసం పక్క మకాంలోకి వెళ్లేతలికి తాడు తెంపుకుని వుడాయించింది" గంగ బిత్తరపోతూ అన్నాడు.

"పక్క మకాం లన్నీ గాలించానండి" అని గంగ చెపుతూన్నా వినిపించుకోలేదు రామనాథం. మరి ఆదుర్దా అలా అని పిస్తుంది! ఇంతకీ రామ

నాథం భయమేమంటే పాలకి మొగంవాచి దూడ ప్రాణాలో దుల్తుందేమో అని.

'ఫరవాలేదు పంతులుగారూ' అని గంగ అంటూన్నా అతనికి బాధ ఎలా తీరుతుంది? నిలువునా కూలిపోయాడు. 'మరి దూడ సంగతేలాగరా అదిదొరికే వరకూ పాలకి మొగం వాచాల్సిందే' రామనాథం అలా అంటుండగానే పక్కపొలం ఆసామి "సంతకి తోలుకుపోతారు ఎదవముండా కొడుకులు. తొరగా ఎతకం"డని అన్నమీదట నిజంగా ముచ్చమటలూ పోశాయి.

"ఏరా గంగా!" బరువుగా బాధగా అన్నాడా మాట, పక్క మకాంనించి బయటకి వస్తూ రామనాథం. గంగ చదువుకోనప్పటికీ రామనాథంభయాన్ని, బాధని అర్థం చేసుకొన్నాడు. అందుకే "మనూళ్లో అలా జరిగిందంటే డొక్క వాలకిల చేస్తాం బాబూ! మీరు పదండి. ఏమూల వున్నా దూడకోసం అదే వస్తాది." అని గంగ ధైర్యంగా అంటున్నా రామనాథం గుండె అదటు తగ్గలేదు.

ఇంతకీ వాళ్ళయింట్లో పాడి అంటూ అచ్చి రాలేదు. భూములు మకతాకిచ్చి వచ్చే ధాన్యం గింజలతో జీవించే సంసారమది. రత్తమ్మ ఒక్కర్తీ మినహాయిస్తే కాదని ఎవరూ అనేవారు లేక, చేసేపని మరోటి లేక సరదాపడి ఏటికిందున్న పదెకరాల మాగాణీ స్వయంగా చేయటానికి మొదలెట్టాడు. రత్తమ్మమాత్రం శతపోరింది. "కడుపులో చల్ల కదలకుండా శిస్తువసూలు చేసుకుని జీవించక యిదేం బుద్ధండీ" అని. అయినా ఆమె అతని భార్య! అంచేత అట్టే బాధలేక పోయింది!

సరదాపడి ఆయన రెండువందలూ పోసి పాడి కోసం పుల్లావుని కొన్నాడు. ఎదురుగావున్న సందులో నూట వీభై ఖర్చు పెట్టి సాల ఏర్పాటుచేసి గడ్డీ గాదంకూడా సమకూర్చాడు. చూలితో వుంది పుల్లావు. గోధుమవర్ణం అంటే రామనాథానికి చాలా యిష్టం!

పక్కయింటి పెదకాపు లోవరాజు భోజనం చేసినమీదటే బేరం పైసలుచేశాడు. అయిన రెండు వందలూ యిచ్చుకుని తోలుకొస్తూంటే పుసుకుడు బేరకాడు వీరయ్యా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ చెయ్యి చాపడం తడవుగా పర్సులోని పదిహేనూ చేతిలో పెట్టి సంతోషించమన్నాడు. వీరయ్యా కొరడంతై "మా సక్క నావు బాబయ్యా. మీ యింటికి మాలచ్మే! మూడు శేర్లకి తక్కువైతే నన్నడగండి" అన్నాడు.

ఆ మాటకి రామనాథంలోని ఆనందం పొంగిపొర్లి వరదలై పారింది.

పుల్లావుని యింటికి తోలుకొచ్చి దొడ్లో కట్టాడు. రత్తమ్మ ముందర - వద్దన్నప్పటికీ దూడని చూడగానే పరవశురాలైంది. రాత్రి గుడ్డిదీపం దగ్గర రామనాథానికి అన్నం వడ్డించి తను వడ్డించుకొంటూ పదిసార్లంది. "చల్లని తల్లి కరుణించి పుల్లావు యీని అదీ పిల్లా కులాసాగా వుంటే వచ్చే అమావాస్యకి కోడిపిల్ల నిచ్చుకుంటా"

నవ్వుతూ రామనాథం అన్నాడు. "అనుకుని యిదాతే కాదోయ్. పాడి చేయాలి తెలుస్తుంది!"

"పిల్లా పీచా పని వుండటానికి! కావల్సినంత చేయచ్చు!" అంటూ అన్నం గిన్నెలోంచి గరిటెతో అన్నంతీసి వడ్డిస్తూ అంది రత్తమ్మ. రామనాథం మాట్లాడకుండా వుండటం చూసి రత్తమ్మే అంది "మనకి లేకపోయినా పశువుల సందడికి లోటు వుండదు లెండి. ఇది యీనితే దూడాదుడుకూ అంతా సందడే!" అని లోవరాజుగారింట్లోంచి తెచ్చిన మీగడపెరుగు పోస్తూ అంది.

రత్తమ్మ వుద్దేశం చిటికిలో అవగాహన చేసుకున్న రామనాథం "పోస్లేవే! ఆ ఏడుకొండలవాడు ఇవ్వాలి; మనకి కలగాలి గాని కేదని ఎన్నిసార్లనుకుంటే మాత్రం ఊడిపడతారా ఏం! ఇంత తిని తిరిగేందుకు మాత్రం వాళ్లకి వుండద్దూ?" దొరికిన సదవకాశాన్ని రత్తమ్మ క్షణంకూడ వదల్లేదు, దీపానికి చూపించినమీదట కంచంలో చవి వడ్డిస్తూ అంది. "అందుకనే లక్షా తొంభైసార్లు మొత్తుకున్నాను. మా చిన్నక్క రెండోవాడు, సుబ్బిగాడు సిసింద్రీలాంటి వెధవ. వాణ్ణి తెచ్చుకుంటే వాళ్లభారం మన కోరికా కూడా తీరతాయిగా! ఏమండీ?" అని ప్రశ్నార్థకంగా ఆపుచేసింది.

పెంచుకోవటం అన్నమాట సుతరామూ రామనాథానికి యిష్టంలేదు. కడుపున పుట్టిన వెధవలే గంజి

నీళ్ళు పొయ్యని యీ కాలంలో పెంపుడు పిల్లలు ఏం పోరగబెడతారని అతని నమ్మకం. ఇప్పుడలాంటి సమాధానం యిస్తే రత్తమ్మ గుడ్డుకి కుంచెడు నీళ్ళు నింపుకుంటుందని "కాలం కూడి రానివ్వవే!" అని మాత్రం అన్నాడు.

భోజనాలు పూర్తిఐన తరవాత చేతి లాంతరుతో రత్తమ్మను వెంటపెట్టుకుని పుల్లావుని చూడ్డానికి పెరట్లోకి వెళ్లాడు. నెవరేస్తూ గడ్డిమేటు పక్కన వున్న పుల్లావు వెన్నుమీద రాస్తూ రామనాథం అన్నాడు. "మనింటికి వచ్చిన మహాలక్ష్మి! దీన్ని పోషించుకోనే భారం నీది!"

రామనాథం గుండెల కవాటాల్లోంచి వచ్చిన మాట రత్తమ్మని ఆ పాదమస్తకం కదిల్చింది. "అలాగే" అని మనస్సులోనే వందసార్లేనా అనుకుంది. పారవశ్యంతో అప్రయత్నంగా అతని చేతిని స్పృశించింది రత్తమ్మ.

జాగ్రత్తగా తాళం వేసుకొచ్చి రామనాథం పక్క జేరుకోనేసరికి అలవాటుగా పట్టుకొచ్చే తమలపాకూ వక్కా కూడా యివ్వకుండానే అతని శయ్యలో పత్ని భాగం పంచుకుంది!!...

పుల్లావును బేరంచేసిననాటి సంఘటన సినీమా రీల్లా కళ్లముందు దొర్లుతూంటే చెమ్మగిల్లిన కళ్లని పంచె చెరగుతో వత్తుకున్నాడు పాపం! రామనాథం-లోవరాజు పొలంవైపు నడుస్తూ!

తోవలో వడ్డీలయ్య పొలం గట్టుమీద ఓ నల్లావు దాని బట్టలపెయ్యా గడ్డి మేస్తున్నాయి. అది చూస్తూంటే రామనాథం గుండె చెరువైంది.

"అయితే గంగా మన పెయ్యా..."

"కంట్లో వత్తి పెట్టుకొని మరీ వెతుకుతా బాబయ్యా! మీ కంగారే కాని దూడకోసం ఆవు ఏ డామళ్ళ దూరంలో కట్టేసినా సకే తిరిగి తిరిగి మరీ మకాం చేరుకుంటుంది. మీరు తమాయించండి!"

అవును; తల్లి ప్రాణం అలాంటిదే! అందులోనూ పశువుకు మరీను. ఔతే ఎలా పారిపోయింది? దూడవుండగా—ఎవరైనా తోలుకుపోయి వుండాలి! యీ మకాం, ఆమకాం తిరుగుతూ వెధవ దూడల్ని వదిలేస్తే ఎవరేనా వచ్చి తోలుకుని పోరూ? అంత నిర్భయంగా, పట్టపగలు, పక్క మకాంలో రైతులుండగా అంత గుండెలున్న వాళ్ళెవరై వుంటారు? పుల్లావుమాత్రం ఎంత యిదౌ తుంటుందో! దూడకి పాలు కుడుపుకోకండా...

"దూడవుండగా ఎందుకు పారిపోతుందిరా పుల్లావు! ఆద మరచి నువ్వుండబట్టే ఏ తాగుమోతో తోలుకుపోయుంటాడు!" రామనాథం కోపంలో అన్నాడు.

"అది కాదు బాబయ్యా కట్టు తెంచుకునిపక్క పొలంలో ఆకుమడి పాడు చేస్తూంటే యీరన్న వీధిలోకి తోలేశాట్ట! అది అక్కణ్ణుంచి ఏదిశగా వెల్లిందో!"

ఇక రామనాథానికి అర్థమైంది. వీరన్నతోలెయ్యకపోతే పుల్లావు పారిపోదు. అక్కణ్ణుంచి మరెవడో తోలివుంటాడు! వీరన్న పాతకసి అంతా తీర్చుకున్నాడు! ఆరోజు తూర్పుగట్టు తగాయిదా మనస్సులో పెట్టుకుని ఎంతపని చేశాడో! ఇంటిదగ్గర దొడ్లో సాల వేయించి పొలంలో కట్టటమేమిటి? అనుకున్నాడు రామనాథం!

"ఆ రోజుని అలా జరక్కపోతే పుల్లావు పోయేదికాదసలు!" యీ ఆలోచన తట్టేటప్పటికి రత్తమ్మమీద రామనాథానికి ఎంతేనా కోపం వచ్చింది! శనిగ్రహంలా అది కూసింది! పాడి అచ్చి రాదని. మరి తను మాత్రం?....

ముచ్చటగా పాలు పితకడానికి పొదుగుదగ్గర చెయ్యి పెట్టేప్పటికి ఫెడేలుమని తన్నింది!

దాంతో పుల్లావుకోసం పడ్డ కష్టం అంతా మరిచిపోయి కోపంతో మండిపోయాడు...

అమావాస్య దగ్గరకొచ్చిన దగ్గర్నుంచీ వెయ్యి కళ్లు పెట్టుకుని తనూ, రత్తమ్మా కూడా పుల్లావుని చూశారు. యీనలేక తదియరోజున పుల్లావు గిలగిలా తన్నుకుంటూంటే చూడలేక పక్క గ్రామంలో ప్రశ్నలు చెప్పే బసవరాజు దగ్గరికి పరుగెట్టి ప్రశ్నకి రూపాయి పావలా కానీ సమర్పించుకొని సుఖంగా పుల్లావు యీని తల్లీ పిల్లా కులాసాగావుంటే పంచల చాపు పెడతానని మాట యిచ్చాడు రామనాథం.

రత్తమ్మమాత్రం ఊరుకుందా? సులువుగా యీని తల్లీ పిల్లా కులాసాగావుంటే మళ్ళీ

అమావాస్యరోజుని పసుపూ కుంకుమా, కోడి పెట్టా యిచ్చుకుంటానని మరోసారి మ్రొక్కింది. నూకాల తల్లికి, గంగకవుక్కుంటూ రైలుగట్టు దగ్గరున్న పశువుల డాక్టరుగార్ని తీసుకొచ్చాడు! ఏ మొక్కుబళ్లూ, మందులూ మాకులూ ప్రయోజన శూన్యమై చివరికి పక్కింటి లోవరాజు భార్య గోసాయి చిటిక్కి టపీమని బట్టల పెయ్య భూమ్మీద పడగానే ఆంజనేయస్వామికి రెండుపుంజీల నారికేళాలు కానుకగా పంపించాడు. రత్తమ్మ లోవరాజు భార్యకి వద్దంటున్నా రవికెల గుడ్డా పసుపూకుంకుమా యిచ్చి తన సంతోషాన్ని తెలియపరిచింది!

మర్నాడు పొద్దున్నకి బజార్లో కొని తీసుకొచ్చిన మూడుశేర్ల చెంబు చేత్తో పట్టుకుని సరదాపడి రత్తమ్మ వద్దంటున్నా పాలుతీయడానికి పొదుగు దగ్గర చెయ్యివేసేసరికి టపీమని తన్నింది. మూడు కటికి లంకణాలు చేశాడు ఆ దెబ్బతో రామనాథం! రత్తమ్మ పోరుపెట్టింది! పాడి వద్దు పశువూ వద్దు కాని పుల్లావుని ముందర సంతలో విరగడి చేయమని! పొలంలోకి తనే తోలించేశాడు. తరవాత రామనాథం తనే తన్లో తమాయించుకొని తల్లి ప్రాణం కదా అని పూరుకున్నాడు.

ఆర్నెల్లలో నన్ను చూసుకో అని తయారైంది దూడ పొలంలోకి వెళ్లినప్పుడల్లా ఓసారి దానివంటిని చేత్తో నిమురుతూ ముద్దుగా 'అరుణా' అని పిలుస్తేనే కాని రామనాథం మనసు కుదుటపడేదే కాదు; పక్కయింటి లోవరాజూ, యింటో రత్తమ్మకూడా 'అదేం పేరండీ?' అంటే అదే తనకి సరదా అయిందనేవాడు. నిగనిగలాడుతూ భంగని గంటేసే లేగదూడ, 'అరుణ'కి పోటుకూడా మప్పాడు గంగ!

"మన అరుణ పోటు నేర్చుకుందేవ్?" అని అన్నం తింటూ ఓసారి రత్తమ్మదగ్గర అన్నాడు రామనాథం!

"ఇంక భాగ్యమే భాగ్యం! పుల్లావు తన్నిందని రెండు లంఖణాలు చేశారు; యిక మీ 'అరుణ' తంతే పదిరోజులు మంచం వేయచ్చు."

రోషంలో మండిపోతూ "నోర్మూయ్! పాడి అనుభవించగలవుకాని పశువులంటే అలా మాలి విరుస్తావెందుకూ?" అని రామనాథం అన్నాడు.

అది రత్తమ్మ లెక్కచేయకుండానే అంది.

"అవును మళ్లీ నన్ను మంచంమీద పడేస్తాయేమో అని."

దాంతో తింటూన్న అన్నం వదిలేసి రామనాథం లేచక్కాపోయాడు....

"దాని పుసురే తగిలింది పుల్లావుకి" నడుస్తున్న రామనాథం యింకా రత్తమ్మమీద కారాలూ మిరియాలు నూరుకుంటున్నాడు.

నిజంగా రత్తమ్మకి పాడి అంటే యిష్టంలేకా? ఆరోజున పుల్లావు తనని తన్నిందనా? మరి యిన్నాయినా ఆ కోపం మనస్సులో మురగబెట్టుకోవడం ఎందుకు? అది తనమీద మమకారంచేత, భర్తని తన్నిందనికోపం తప్ప మరేం లేదు దానికి! పాపం! అమాయకురాలు రత్తమ్మ! సనాతన ఆచార సంప్రదాయాలూ ఛాదస్తం, పిచ్చి నమ్మకాలూ తప్ప మరేం తెలీవు దానికి!

పరస్పరవిరుద్ధ భావాల సంఘర్షణలో, పుల్లావు పోయిందన్న బాధ భారంతో, జరిగిన చరిత్రతాలూకు సంఘటనల్ని నెమరువేసుకుంటూ, అడుగులో అడుగువేస్తూ, తన ఆలోచనలకి లయవేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు రామనాథం!

"ఐతే బాబూ!"

గంగమాట పూర్తిచేసే లోపల ఆత్రతగా రామనాథం "ఏంరా గంగా?" అన్నాడు!

"బందీల దొడ్డికూడా ఓసారి గాలిస్తే?"

కొన్ని పందులు, రెండు బార కొమ్ములబర్రెలు మాత్రమే అక్కడవున్నాయి. లోవరాజు దోవలో కనిపించాడు. గడ్డిఆవ చుట్టూగోడ కట్టేందుకని యిటిక తోలుతున్నాడు. పుల్లావుపరారీ సంగతి విని "దూడుండగా ఆవు పారిపోడమేంటీ? పంతులుగారు! యిది కచ్చగల యే గాడిదకొడుకో చేసిన పనే కాని మరోటి కాదండి!" బారెడు చుట్ట వెలిగించి రెండువేళ్ళతోనూ తిప్పుతూ అన్నాడు లోవరాజు.

"తాడు తెంపుకుని మేస్తుంటే, తన పొలం పాడుచేస్తుందని యీారన్న యీాఘులోకి తోలాట్టండి" గంగ అన్నాడు.

"సంతలోకి తోలుకుపోరు కద?"

రామనాథం దిగులు గ్రహించి లోవరాజు యిలా అన్నాడు, ఎర్రగా చింతనిప్పలా కాలుతున్న చుట్టదమ్ము మరోటి లాగి అడ్డపొగ పెట్టడానికి సన్నాహం చేస్తూ. "యెదవలకి గుండె లుండొద్దుటండీ! మూడావడల్లో దాచినా పెయ్యికోసం అదే వస్తుంది!"

ఊళ్లో కాఫీ తీయడానికని గంగని పంపి లోవరాజూ తనూ, యిటికలతోవ పూర్తిచేసి తూర్పు దిక్కుగా నడిచారు.

ఏటి మొగపాలెంలో టంకు కూడా వేయించాడు లోవరాజు. అయితే మాత్రం? ఆరాలు తీసి తీసి యిక లాభం లేదని నిర్ణయించుకుని వెనక్కి బయలుదేరారు.

"దొడ్లో ఎవడేనా దాచేశాడేమో లోవరాజూ"

"గోడలు దాటేనా దూడకోసం వస్తాది బాబయ్యా! దూడల అనుభవం మీకు లేదుకాని! అవి మనుషులకంటే ఎక్కువ మమకారం కలవి! దూడకి దూరమైతే మళ్లీ అది కనపడేవరకూ మేత కూడా మెయ్యదంటే నమ్మండి."

"గంగ ఎటు తిరుగుతున్నాడో లోవరాజూ! ఊళ్లో నువ్వే కనుక్కోవాలిగాని..."

రామనాథం యిలు చేరుకుని గడపమీద కాలు పెడుతూ అన్నాడు. చీకటి బాగా పడింది. లోవరాజు 'అలాగే లెండి' అంటూ తన యింటివైపు నడిచాడు.

పుల్లావుకోసం వెతికి వెతికి ఫలితంలేక నిరాశతో అలిసిపోయి నీరసంగా తలుపు తట్టాడు!

"బాబూ!"

నీరసించిన గుండెల్లో అమృతవర్షం కురిసినట్టైంది. ఆతృతగా "గంగా?" అన్నాడు రామనాథం!

"అంబటి యీథికేసి వెడుతూండగా మన పుల్లావు కనబడిందిట బాబయ్యా! యీరన్న .పాలికాపు రత్తిగాడు చెప్పాడండి."

రత్తమ్మ తలుపు తీసింది. లోవరాజు భోజనం చేసి బయలుదేరుదామన్నాడు. రత్తమ్మ కూడా అన్నం తినకుండా బయలుదేరితే తన్ని చంపుకు తిన్నంత వొట్టంది. అయినప్పటికీ బయలుదేరాడు.

రామనాథం! పుల్లావుజాడ తెలిసింది. అది దొరికిన తరవాతే అన్నీ కూడా. తప్పని సరిగా లోవరాజూ, గంగకూడా రామనాథాన్ని అనుసరించారు.

అగ్రహారంవైపు నడుస్తూ లోవరాజు చెప్పాడు. పుల్లావు జాడ తెలిసిందన్న సంబరంకొద్దీ కంగారుపడి నోరు జారితే ఆనవాళ్లు మారిపోతాయని.

"కావాత్నే పదో పరకో వాడి మొఖాన్ని కొడదాం లోవరాజూ!" పుల్లావు దొరకడమే చాలనే వుద్దేశంలో వున్నాడు.

రామనాథం అమాయకత్వానికి లోవరాజు ఫక్కున నవ్వాడు.

"ఏరా గంగా మన ఎల్లగిత్త తగవులాట జ్ఞాపకం వుందీ?" అన్నాడు.

"ఏమైందేమిటి" వినడానికి ఎంతో ఆసక్తత చూపిస్తూ అన్నాడు రామనాథం.

"ఏం జరగాలో అంతా జరిగింది! కత్తులు రాపాడుకున్నాయ్. బుర్రలు పగిలిపోయేవే!"

"ఏమిటీ?" లోవరాజు బొంగురుపోయిన కంఠంలోంచి వచ్చే ప్రతి అక్షరాన్నీ శ్రద్ధగా వింటూన్నాడు రామనాథం.

"ఎల్లగిత్త తాడు తెంపుకుని వీధులో పడిందా! మన సందు చివారవున్న సత్తెయ్య గడ్డిమేటు వెనుక ఆర్నెల్లు దాచేశాడు.

"మరి తలెత్తుకు తిరిగే పెద్దమనిషి కదయ్యా లోవరాజూ!"

"అంతా పెద్దముసులే పంతులుగారూ! ఆ తెర తొలగిస్తే పెద్దమడిసి తరహా బయటడుతుంది! దొరక్కపోతే దొర, దొరికితే దొంగా! అంతేనండి ముండాలోకం!"

"మరెలా దొరికింది?"

"ఏదో పనిమీద మా మరదలుపిల్ల వాళ్లింటికెళ్లి చూసింది. రాత్తిరి మాటల సందర్భంలో అచ్చంగా మన ఎల్లగిత్తే బావా! అంది. ఆర్నెల్లయీ మధ్య వాడు పసువులసంతే చూడలేదు. అయిందేదో అయిందిగాని ఎల్లగిత్త నాకు మళ్లా తోలెయ్యి సత్తెయ్య మావా అంటిని! దాంతో దిక్కులు పగిలేలా అరుస్తూ, 'దొంగ తనం చేశానంటావా! నర

కుతా చంపుతాన'ని కూర్చున్నాడు. మునసీబుగార్ని తీసుకెడితే ఎడంపిర్రమీద వాత వేసి నీ ఆనవాళ్లుంటే తీసుకోమన్నాడు! తాగుమోతు ఎదవ!" పాతకక్షు అంతా వెళ్లగక్కుతూ మాటలు ప్రతీదీ నొక్కి నొక్కి లోవరాజు అంటూంటే చీకట్లో లోవరాజు మొఖం కనపడ నప్పటికీ గ్రహిస్తూనే వున్నాడు రామనాథం!

మునసీబుగారింటి కేసి దారితీస్తూ లోవరాజు అన్నాడు.

"నాల్గురోజుల తరవాత ఏమనుకొన్నాడో అవసరం వుందని ఓ ఏభైరూపాయలు పుచ్చుకొని నాగిత్తని నాకే తోలేశాడు! ఎధవ!"

రామనాథం మెదడులో రైళ్లూ బళ్లూ పరుగెడుతున్నాయ్! మునసబుని వెంట పెట్టుకుని అంబటి వీధులోకి వెళ్లారు. ఆ ప్రశాంత నిశీథిలో సందు మలుపు తిరుగుతుంటే పెద్దయ్య పశువుల పెరట్లోంచి అంబా" అనే అరుపులు వినిపిస్తున్నాయి.

నడుస్తున్న రామనాథం చటుక్కున ఆగి "మన పుల్లావు కేకలావుంది లోవరాజూ" అన్నాడు.

"చాల్లెండి పంతులుగారూ! ఏదో వాడిగిత్త."

"అంబా!" యీసారి గంగకూడా అన్నాడు.

ఆ అర్థరాత్రిపూట పెద్దియ్యతో కయ్యానికి కాలుదువ్వటం ఎందుకన్నాడు మునసబుగారు. వెంటనే పుల్లావుని తోలుకు తెచ్చుకోవాలని ఎంత ఆరాట పడుతున్నా, పెద్దమనుష్యులు చెపుతూంటే ఇక బావుండదని గృహోన్ముఖు డైనాడు రామనాథం!...

"ఇంతకీ ఆ అరుపు పుల్లావుదేనా! గంగకూడా నిర్ధారణ చేశాడాయె! రేపు వెడితే పెద్దయ్య న్యాయంగా యిస్తాడా? ఇంతకీ అది నిజంగా పుల్లావు కాకపోతే?"

...అన్నం తింటున్నాడన్న మాటేకాని యీ ఆలోచనల మధ్య నలిగిపోతున్నాడు రామనాథం!

రామనాథం గత మూడురోజుల సంఘటనల్నీ నెమరు వేసుకుంటున్నంతసేపు రత్తమ్మ ఎప్పటికేనా నీళ్లు కారే ఆవకాయీ అన్నంవైపు చేయి వెడుతుందేమో అని ఓర్మితో కాసుకూచుంది. అంతసేపు వాకిలిలో కంచి గరుడసేవ చేస్తున్న గంగకి విసుపెత్తి "పంతులుగారూ!" అని గట్టిగా కేకేసేప్పటికి భూత కాలంలో తిరుగుతున్న రామనాథంతోపాటు భవిష్యాన్ని ఆలోచిస్తున్న రత్తమ్మ ప్రస్తుతంలోపడి "మిమ్మల్నే" అంది.

"వస్తున్నా గంగా" అంటూ అదరా బదరా మిగిల్న నాల్గు మెతుకులూ పూర్తిచేసి గంగదగ్గరికి వచ్చాడు రామనాథం.

"యివాళ రాత్తిరికి మనకి వంతొస్తాది బాబయ్యా"

రామనాథం పొలం నీటిఎద్దడి. వంతు రావడమే బహుకష్టం. వంతురోజుల్లో తలలు పగలడం వరకూ వస్తూంది. అందులోనూ వీరన్న పాతకక్షులతో వద్దు కొట్టేస్తే! గంగని పక్కరైతులు డబాయించి వంతు పట్టుకుపోతారు! మరి పుల్లావు? పెద్దయ్య దగ్గర కెళ్లి తోలుకు రావద్దూ? ఇంతకీ పెద్దయ్య పశువుల కొట్టాంలోంచి వినపడినది పుల్లావు అరుపో కాదో!

ఇటుపొలం! యిప్పటికే బాగా ఆలస్యమైపోయింది. యీ వచ్చిన వంతేనా వదులుకుంటే ఆరాలే ఏడు ఎనిమిది బస్తాలేనా రాలదు!

వివిధ సమస్యల్లో కర్తవ్యం బోధపడింది కాదు రామనాథానికి! చివరకి తనలో తనే నిర్ణయాన్ని చేసుకుంటూ అన్నాడు. "నువ్వు, తెల్లారుగట్ల పెద్దయ్య పశువుల కొట్టంలో పుల్లావుందో లేదో చూసి లోవరాజుని తీసుకెళ్లు, నేను పొలానికి నీరు పెడతా!"

గంగ వెళ్లిపోయాడు! కొస్త పక్కమీద వాల్దామన్నా కునుకుపట్టలేదు రామనాథానికి! ఆకాశంలో వేగుచుక్క వెలుగుతూంటే, తొలికోడి కూతకూడా వినకుండానే పొలానికి వెళ్లాడు రామనాథం!

*　　*　　*　　*

"పుల్లావు వుందిరా! గంగా!" వోడ్డుదగ్గర కర్ర పుచ్చుకుని కూచున్న రామనాథం, ఒక్కడే పరుగెత్తుకుంటూ వస్తున్న గంగని చూసి కంగారుగా ప్రశ్నించాడు!

"యెదవ! నిన్న రాత్తిరి మనం వచ్చామని తెలుసుకుని తెల్లారు ఝామునే యీధులోకి తోలేశాట్ట బాబూ! నేనూ, లోవరాజు కాపుగారు వెళ్లేతలికి, కావాలిస్తే తొడ్డి చూసుకోమని తలుపులు తీశాడు!"

కుదుటపడుతున్న రామనాథం గుండెలకి గంగ చెప్పే ప్రతి అక్షరంకూడా ఒక్కొక్క సుత్తి దెబ్బలా తగిలింది! కూర్చున్న రామనాథం కూర్చునట్టే వుండిపోయాడు అయిదు నిముషాలు! "అయితే పుల్లావు దొరకదన్న మాటేనా గంగా!" వేసిన వడ్డుకి చిన్న గండిపడినా చెమ్మగిలిన కళ్ళతో కనిపెట్టనే లేకపోయాడు. మకాంలోంచి "అరుణ" తెగ అరుస్తోంది! గంగ వడ్డుమాని పారపుచ్చుకొని కాలవలోకి దూకాడు!

"పుల్లావు కనపడింది పంతులుగారూ!!" లోవరాజు ఆవును తోలుకుంటూ వచ్చాడు! రామనాథం ఆనందంలో పొంగిపోయాడు!

"యెదవ! మన రాక పసిగట్టి వీధులోకి తోలేశాడు! గంగని వదిలేసి, అడ్డదోవంట మాచేలోకి పోతుంటే తోవలో కనిపించింది!"

గట్టుని దిట్టంచేస్తున్న గంగ పార అక్కడే పడేసి మకాంలోకి పుల్లావుని తోలుకెళ్ళి దూడని పాలుకుడుచుకోడానికి వదిలాడు! పెద్దదౌతూన్న గండిలోంచి తన 'వంతు నీరు పోతున్నా అంత శ్రద్ధ పట్టించుకోకుండా, పుల్లావు మెడ నిమురుతూ అన్నాడు రామనాథం "పోన్లెద్దు లోవరాజూ! పారిపోయిన పుల్లావు దొరకడమే చాలు మనకి! ఆవుని కట్టేసిన పెద్దయ్య వాడి పాపాన్నే పోతాడు! ఇంతకీ అరుణది అదృష్టం!"

